క్లుప్తంగా

జగనన్న పాల వెల్లువపై అవగాహన

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం జగనన్న పాల వెల్లువ కార్యక్రమం జరిగింది. పినపళ్ల, సంధిపూడి గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచ్‌లు సంగిత సుభాష్, తోట భవాని అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పశు వైద్యాధికారి బి.సుభాష్ చంద్ర, ప్రత్యేక అధికారి మేరీరోజ్ విచ్చేసి జగనన్న పాల వెల్లువ వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ప్రభుత్వ భాగస్వామ్యంతో ఒప్పందం చేసుకున్న అమూల్‌కు పాడి రైతులు పాలు పోయడం ద్వారా అధిక లాభాలను పొందాలని సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ మోటుపల్లి వెంకన్న, పంచాయతీ కార్యదర్శి ఎస్.వీర్రాజు, తోరాటి గోవిందు, సిద్దిరెడ్డి శివ తదితరులు పాల్గొన్నారు.

రాజోలు తహసీల్దార్‌గా గోపాలకృష్ణ



రాజోలు: మండల తహసీల్దార్‌గా ఎ.గోపాలకృష్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆలమూరు తహసీల్దార్‌గా పని చేసిన ఆయన రాజోలు బదిలీపై వచ్చారు. గత నెలలో బదిలీపై రాజోలు తహసీల్దార్‌గా వచ్చిన పాల్ ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన గోపాలకృష్ణను డిప్యూటీ తహసీల్దార్ ఎస్.శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్‌లతో పాటు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

4, 5, 6 తేదీల్లో సువార్త మహాసభలు

సఖినేటిపల్లి: మండలంలోని అప్పనరాముని లంక శివారు కొత్తలంకలో ఐపీసీ చర్చి గ్రౌండ్ నందు ఈ నెల 4,5,6 తేదీల్లో క్రైస్తవ సువార్త మహాసభలను నిర్వహిస్తున్నట్టు సభల కన్వీనర్, చర్చి పాస్టర్ రెవ.జిల్లెళ్లరాజు శనివారం తెలిపారు. ఐపీసీ చర్చి 27వ వార్షిక దినోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సభల్లో ముఖ్య అతిథులుగా ఐపీసీ ప్రెసిడెంట్ బిషప్ పి.సామ్యూల్ ఫిన్నీ, పాస్టర్ ఇందుపల్లి జేమ్స్, రెవ.డాక్టర్ పి.దీవెన కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని ఆయన అన్నారు.

టింకరింగ్ ల్యాబ్ ప్రారంభం

అయినవిల్లి: మండలంలోని నేదునూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 'అటల్ టింకరింగ్ ల్యాబ్'ను శనివారం జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ తిలకించారు. జిల్లా, రాష్ట్ర, సౌత్ ఇండియా స్థాయిలో జరిగిన సైన్స్ ఫెయిర్‌లో అవార్డులు పొందిన గౌతమ్, గణేష్‌లను అభినందించారు. కార్యక్రమలో ఎంఈఓ-2 పి.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు, ఎంపీటీసీ సుబ్బరాజు తదితరులను అభినందించారు.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభహారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసి పూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటిక బెల్లం మొక్కుబడి చెల్లించారు.

వైద్య సిబ్బందికి గొడుగుల వితరణ

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో శనివారం వైద్యారోగ్య సిబ్బందికి గొడుగుల వితరణ జరిగింది. సర్పంచ్ గుణ్ణం రాంబాబు రూ.ఐదు వేలు వెచ్చించి స్థానిక సబ్ సెంటర్ పరిధిలోని ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలకు గొడుగులను అందజేశారు. వేసవి దృష్ట్యా తాగునీటి సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు.

జెడ్పీ మాజీ చైర్మన్‌కు పరామర్శ

మామిడికుదురు: సతీవియోగంతో బాధపడుతున్న జెడ్పీ మాజీ చైర్మన్, ఉమ్మడి జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు నామన రాంబాబును మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, మాజీ ఎమ్మెల్యేలు చిల్లా జగదీశ్వరి, దాట్ల బుచ్చిబాబు, చెల్లి వివేకానంద, పి.అంజిబాబు, టీటీడీ ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు డొక్కా నాథ్‌బాబు తదితరులు శనివారం పరామర్శించారు. రాంబాబు భార్య కృష్ణవేణి ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆమె చిత్రపటం వద్ద పుష్పాలుంచి నివాళులర్పించారు.

బైక్ ఢీకొని సైక్లిస్టుకు గాయాలు

అయినవిల్లి: మండలంలోని ఓ మోటార్ సైక్లిస్ట్ అతి వేగంగా వచ్చి సైక్లిస్టును ఢీ కొనడంతో అతనికి తీవ్రగాయాలైన ఘటన శనివారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై బి.రాజేష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం విలస గ్రామం సాయిబాబా ఆలయం వద్ద అదే గ్రామానికి చెందిన దాసరి సూర్యనారాయణ సైకిల్‌పై వెళ్తున్నాడు. వీరవల్లిపాలెం నుంచి అమలాపురం వైపు బైక్ అతి వేగంగా వచ్చి సైకిల్‌పై వెళ్తున్న దాసరి సూర్యనారాయణను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సూర్యనారాయణకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన సూర్యనారాయణను వైద్యం నిమిత్తం అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడు సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలియో రహిత సమాజమే లక్ష్యం



పెదపళ్లలో పల్స్ పోలియో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

- నేడు పల్స్ పోలియో
- ఏర్పాట్లు పూర్తి చేసిన వైద్యాధికారులు

ఆలమూరు: పోలియో వ్యాధి రహిత సమాజమే లక్ష్యంగా ఏటా క్రమం తప్పకుండా అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు చిన్నారుల కోసం పల్స్ పోలియో శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. పోలియోను దేశం నుంచి తరిమి కొట్టేందుకు వైద్యారోగ్యశాఖ పల్స్ పోలియోపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తుంది. ఏటా జనవరి నుంచి మార్చి లోపు ఒక ఆదివారం రోజున పోలియో దినాన్ని నిర్వహించడం పరిపాటిగా మారింది. జిల్లావైద్యారోగ్య శాఖ ఆదేశాల మేరకు మార్చి మూడున నిర్వహించే ఈపల్స్ పోలియోను రాజోలు, కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని 23 పీహెచ్‌సీల పరిధిలో 117 బూత్‌ల ద్వారా 228 మంది సిబ్బంది 18,997 మందికి పోలియో చుక్కలు అందించేందుకు ఆయా పీహెచ్‌సీ వైద్యాధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

పోలియో చుక్కల లక్ష్యం ఇలా..

నియోజక వర్గం	పీహెచ్‌సీలు	బూత్‌లు	సిబ్బంది	లక్ష్యం
కొత్తపేట	08	37	128	5891
రాజోలు	07	38	152	6324
పి.గన్నవరం	08	42	168	6782
మొత్తం	23	117	448	18997

అవగాహన కల్పిస్తున్నాం



పోలియో రహిత సమాజమే లక్ష్యంగా చిన్నారులందరికీ పోలియో చుక్కలను వేసేందుకు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం, పోలియో మహమ్మారి వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నాం. వైద్యారోగ్యశాఖ లక్ష్యాన్ని అధిగమించే దిశగా చర్యలు చేపట్టాం.

– వి.సువర్చల, ఎంఎల్‌హెచ్‌పీ, చింతలూరు

మొబైల్ వాహనాల ఏర్పాటు



దేశంలోని చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయాలనే లక్ష్యంతో పల్స్ పోలియో శిబిరాలను ఏర్పాటు చేయడంతో పాటు మొబైల్ వాహనాలను ఏర్పాటు చేసి మారుమూల నివసిస్తున్న కూలీలు, కార్మికుల పిల్లలకు కూడా పోలియో చుక్కలు అందించేందుకు ఏర్పాట్లు చేశాం.

– ఏవీవీ రాజా, హెల్త్ ఎడ్యుకేటర్, పీహెచ్‌సీ, పెదపళ్ల

పేదల సొంతింటి కల సాకారం



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రాజోలు: నిరుపేదల సొంతింటి కలను సీఎం జగన్మోహన్‌రెడ్డి ద్వారా సాకారమైందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం కాట్రేనిపాడులో 55 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఇళ్ల పట్టాలు అందజేశారు. అలాగే నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, అంగన్‌వాడీ భవనం, గడప గడపకూ నిధులతో నాలుగు ప్రాంతాల్లోని సీసీ రోడ్లను ప్రారంభించారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ నవరత్నాలతో గ్రామాల్లో అభివృద్ధి బావుటా ఎగురవేశారన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడిన నిరుపేదల కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందజేసి, సొంత ఇంటిని నిర్మించి ఇచ్చిన ఘనత సీఎం జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో జగనన్న కాలనీలను సందర్శిస్తే కొత్తగా ఊరు ఏర్పడినట్టు కాలనీలు కనిపిస్తున్నాయన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, జెడ్పీటీసీ మట్టా శైలజ, సర్పంచ్ అడబాల శ్రీనివాస్, ఎంపీటీసీ అడబాల శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ అడబాల రామప్రసాద్, నాయకులు పైడిపర్తి రామారావు, పైడిపర్తి రత్నాజీ, కొంబత్తుల ప్రసాద్, కాటాడీ ఉమామహేశ్వరరావు, తాడి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు ప్రశాంతంగా రాయాలి

అంబాజీపేట: రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఒత్తిడికి దూరంగా ఉండి ప్రశాంతంగా పరీక్షలు రాయాలని మండల షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘ అధ్యక్షుడు నందిక వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు వెన్నపు సత్యనారాయణ అన్నారు. గంగలకుర్రులో ఇంటిగ్రేటెడ్ వసతి గృహాన్ని షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘ నాయకులు శనివారం సందర్శించారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష అట్టలు, జామెంట్రీ బాక్స్‌లు, పెన్నులు, పెన్సిల్ తదితర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో విప్పర్తి సుకేషిని, టి.రామకుమారి, హాస్టల్ వార్డెన్ బీఎం సత్యనారాయణలు పాల్గొన్నారు.

గడప గడపకూ నిధులతో రోడ్లకు మహర్దశ



మెరకపాలెంలో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రాజోలు: గడప గడపకూ నిధులతో గ్రామాల్లోని రోడ్లకు మహర్దశ పట్టిందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం మెరకపాలెం, ములికిపల్లి గ్రామాల్లో గడప గపకూ నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే రాపాక ప్రారంభించారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిని సందర్శించి గ్రామాల్లోని సమస్యలను గుర్తించామన్నారు. సమస్యల తక్షణ పరిష్కారానికి ప్రభుత్వం సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసిందన్నారు. ఆ నిధులతో గ్రామాల్లో అత్యవసరమైన రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. అలాగే అసంపూర్తిగా ఉన్న రోడ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు అంచనాలు రూపొందించామన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, జెడ్పీటీసీ మట్టా శైలజ, మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు కంచర్ల శేఖర్, తెన్నేటి కిషోర్, అడబాల నారాయణప్రసాద్, మట్టా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం

సఖినేటిపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం శృంగవరప్పాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన నిధులతో నిర్మించిన సీసీ రోడ్లును ఆయన ప్రారంభించారు. జేజేఎంలో నిర్మించిన వాటర్ ట్యాంకును, నూతన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ రావి నాగవెంకట లక్ష్మీదేవి, ఎంపీటీసీ యెనుముల కొండమ్మ, పెదపాటి నాగలక్ష్మి, ఏఏఎం చైర్మన్‌లు ఇంజేటి శామ్యూల్ రాజు, నల్లి శివకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, గ్రామ శాఖ అధ్యక్షుడు మద్దాల భాను, మాజీ సర్పంచ్ దీపాటి ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలతో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

- ఆలయంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రత్యేక పూజలు
- బ్రహ్మోత్సవాల నిర్వహణకు రూ.లక్ష విరాళం



చింతలూరులో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దంపతులు

ఆలమూరు: మండలంలోని చింతలూరులోని నిత్య వైకుంఠ ద్వారంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలతో అంతటా ఆధ్యాత్మికత వెల్లి విరుస్తుంది. బ్రహోత్సవాలు మూడవ రోజైన శనివారం నిర్వహించిన ప్రత్యేక పూజలకు కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ మర్యాదలతో ఆలయ కమిటీ పూర్ణకుంభంతో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, లావణ్య దంపతులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన శిరస్సున తలంబ్రాలు, పట్టువస్త్రాలు ధరించి సన్నాయి వాయిద్య మేళాల మధ్య ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి దేవతామూర్తులను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు తమ వంతు సాయంగా రూ.లక్ష విరాళాన్ని అందజేసి భోజన వసతిని సమకూర్చారు. అనంతరం ఆధ్యాత్మిక వేత్త అల్లంరాజు భరణి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి ఘన సత్కారం జరిగింది. గజవాహనంపై వేంకటేశ్వరస్వామి ఊరేగింపు బ్రహోత్సవాల మూడో రోజైన శనివారం వేంకటేశ్వరస్వామి గజవాహనంపై ఊరేగింపు జరిగింది. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. ప్రజల ఆరోగ్య సిద్ధి కొరకు నిర్వహించిన ఆయుష్య హోమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అలాగే గంధోత్సవం, వసంతోత్సవం అలరించింది. వేద పండితులు ప్రవచించిన ఆధ్యాత్మిక ప్రవచనాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. వైఎస్సార్ సీపీ నేతలు తమ్మన శ్రీనివాసు, నామాల శ్రీనివాసు, నూకపెయ్యి సూరిబాబు, నెక్కంటి వెంకట్రాయుడు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, సర్పంచ్ మార్గాని కరుణ యేసు, ఉప సర్పంచ్ మోరంపూడి వాసు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం




కడలి సొసైటీ చైర్మన్ సురేష్‌ను కలసిన మాజీ మంత్రి గొల్లపల్లి

రాజోలు: వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా సేవలందిస్తానని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు శనివారం అన్నారు. టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిన గొల్లపల్లి సూర్యారావు నియోజకవర్గంలోని పలువురు ముఖ్య నాయకులను మర్యాద పూర్వకంగా కలిశారు. తాటిపాకలోని మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ పితాని మర్మావతి, పితాని రాంబాబు, కడలి సొసైటీ చైర్మన్ తోట సురేష్, సర్పంచ్ చొప్పల గుణనాథ్, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం కార్యదర్శి కంచర్ల శేఖర్ తదితరులను కలిశారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానన్నారు. గత రెండు రోజులుగా టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. పదేళ్లుగా రాజోలు నియోజకవర్గంలో టీడీపీని బలోపేతం కోసం అహర్నిశలు శ్రమిస్తే చంద్రబాబు, లోకేష్‌లు తనకు ఎలాంటి గౌరవం ఇవ్వకుండా పదే పదే అవమానాలకు గురి చేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి విజయ ఢంకా మోగిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

స్వామివారి సన్నిధిలో కలెక్టర్, ఆర్డీవో



అంతర్వేది ఆలయంలో స్వామివారి చిత్రపటం అందుకుంటున్న కలెక్టర్



స్వామివారి లడ్డూ ప్రసాదం అందుకుంటున్న ఆర్డీవో

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా కుటుంబ సభ్యులతో కలసి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకట శాస్త్రి, అర్చకులు ఆలయ మర్యాదలతో కలెక్టర్‌కు స్వాగతం పలికారు. పూజలు అనంతరం అర్చకులు కలెక్టర్‌కు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి లడ్డూ ప్రసాదం, చిత్రపటం దేవస్థానం సిబ్బంది అందజేశారు.

స్వామివారి సన్నిధిలో ఆర్డీవో

ఆలయంలో శనివారం అమలాపురం ఆర్డీవో జి.కేశవ వర్ధన్ రెడ్డి కుటుంబ సమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి లడ్డూ ప్రసాదం, చిత్రపటంను సూపరింటెండెంట్ పి.విజయ సారథి అందజేశారు.

జి.అగ్రహారం విద్యార్థుల ప్రాజెక్టుకు తృతీయ స్థానం

అంబాజీపేట: వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం (ఈఎండీపీ)లో భాగంగా గంగలకుర్రు అగ్రహారం విద్యార్థులు తయారు చేసి ఉపయోగించిన కొబ్బరి బొండాలను తిరిగి రీసైక్లింగ్ ప్రాజెక్టుకు తృతీయ స్థానం లభించినట్లు పాఠశాల హెచ్‌ఎం కె.శ్రీనివాస తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ప్రాజెక్ట్ తయారు చేసిన విద్యార్థులను శనివారం పలువురు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ నెల 1న కొత్తపేటలో జరిగిన జిల్లా స్థాయి రీ సైక్లింగ్ ఆఫ్ యూజ్డ్ టెండర్ కోకోనట్ అనే ప్రాజెక్టు మంచి ప్రదర్శన ఇవ్వడంతో తృతీయ స్థానం వచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్టేట్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ట్రైనింగ్ (ఎస్ఈఆర్‌టీ), ఈఎండీపీ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దీనివల్ల విద్యార్థుల్లో పారిశ్రామిక మనస్తత్వం పెరుగుతుందన్నారు. ఈ ప్రాజెక్టు తయారు చేసిన విద్యార్థులు చొల్లంగి హేమ విజయలక్ష్మి, దొంగ బాలఅపర్ణ, గైడ్ టీచర్ ఎంఎస్ఎస్ కుమారిలను సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, ఉప సర్పంచ్ బంధన రాంబాబు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎంఎం శెట్టి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎం.సూర్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఈవీఎంలపై అవగాహన

మలికిపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంలపై అవగాహన, శిక్షణ కార్యక్రమం శనివారం స్థానిక ఎంవీఎన్ జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగింది. తహసీల్దారు జి.అనిత కుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండలంలోని మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈవీఎంలపై పూర్తి స్థాయి అవగాహన కల్పించుకోవాలన్నారు. ఎంపీడీఓ ముత్యం వీరా స్వామినాయుడు, ఎంఈఓ ఎం. విజయశ్రీ, వీఆర్‌ఓ హరికిషన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజోలు: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఈవీఎం)ల అనుసంధాన ప్రక్రియలపై మహిళా ఉద్యోగులకు శనివారం శిక్షణ ఇచ్చారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో తహసీల్దార్ కె.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, శిక్షణ నిర్వహించారు. మాస్టర్ ట్రైనీలు ఉండవల్లి శ్రీనివాస్, అడబాల కాశీ విశ్వేశ్వరరావు, గెల్లి విశ్వనాథ గుప్త, గటిగంటి శ్రీనివాస్‌లు ఓటు వేసే సమయంలో వినియోగించే వీవీప్యాడ్, బ్యాలెట్ యూనిట్, ఓటింగ్ యూనిట్‌ల పనితీరుపై అవగాహన కల్పించారు. ఈ మూడు యూనిట్స్‌ను అనుసంధానం చేసే ప్రక్రియపై మహిళా ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఈవీఎంలపై ఎన్నికల విధులను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఉద్యోగికి శిక్షణ ఇస్తున్నామని తహసీల్దారు గోపాలకృష్ణ తెలిపారు. ఎంఈఓ మనోహరం, డిప్యూటీ తహసీల్దారు ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విజయమే లక్ష్యంగా పనిచేద్దాం



జి.అగ్రహారంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్, ఇన్‌చార్జి వేణుగోపాలరావు

అంబాజీపేట: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన అభివృద్ధి ప్రదాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విజయమే లక్ష్యంగా అందరం కలసికట్టుగా పనిచేద్దామని ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్, ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం గ్రామాల్లో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో శనివారం పార్టీ సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి వేణుగోపాలరావు మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా రూ.కోట్లు అన్ని వర్గాల ప్రజలకు సీఎం జగన్ లబ్ధి చేకూర్చినందున ప్రజలంతా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని నూరు శాతం అమలు చేసిన తీరును ప్రజల్లోకి తీసుకువెల్సిన బాధ్యత మన పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ మాజీ సభ్యుడు నేలపూడి స్టాలిన్‌బాబులు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ సువర్ణ పాలన అందిస్తున్న విషయాన్ని ప్రతి ఓటరుకు వివరించి మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేలా ఆశీర్వందించాలన్నారు. అనంతరం ఇన్‌చార్జి వేణుగోపాలరావుతో పాటు నూతనంగా ఎన్నికైన పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావును, నాయకుడు స్టాలిన్ బాబును, మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల శేఖర్‌ను, పేరి శ్రీనివాస్‌ను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్‌లు కాండ్రేగుల శ్రీనివాసరావు, దొంగ నాగేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, ఎంపీటీసీలు నెల్లి పండు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎంఎం శెట్టి, రాయుడు షన్ముఖ్, మట్టపర్తి హరి, దొమ్మేటి నాగన్న తదితరులు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలి



పి.గన్నవరంలో వెంకటరామిరెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

పి.గన్నవరం: ఇటీవల నియమితులైన 1998 డీఎస్సీ, ఎంటీఎస్ ఉపాధ్యాయుల రిటైర్మెంట్ వయసును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని ఉమ్మడి జిల్లా అసోషియేషన్ అధ్యక్షుడు చొల్లంగి కేశవకుమార్ శనివారం పి.గన్నవరానికి విచ్చేసిన రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు కాకర్ల వెంకటరామిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. పి.గన్నవరంలోని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు క్యాంపు కార్యాలయంలో వెంకటరామిరెడ్డిని 1998 డీఎస్సీ, ఎంటీఎస్ ఉపాధ్యాయుల అసోషియేషన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి, ఆయన్ను దుశ్శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా వారి సమస్యలను వెంకటరామిరెడ్డికి వివరించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు అసోషియేషన్ నాయకులు తెలిపారు. వెంకటరామిరెడ్డిని కలసిన వారిలో నాయకులు అల్లు వజ్రకుమార్, వడలి రవికాంత్, చెల్లుబోయిన శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
మామిడికుదురు శాఖ, మామిడికుదురు, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

స్వాధీనతా ప్రకటన
(స్థిరాస్తుల ప్రకటన) (చట్టం - రూల్ 8(1) క్రింద)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలు వినియోగించుకుంటూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మామిడికుదురు శాఖ, మామిడికుదురు, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు 27-12-2023 తేదీ గల డిమాండ్ నోటీసు జారీ చేసి **రుణగ్రహీత శ్రీమతి కాండ్రేగుల దుర్గాలక్ష్మి, భర్త దుర్గారావు, డో.నెం. 3-113, ఈదరాడ, మామిడికుదురు మండలం, తూర్పుగోదావరిజిల్లా (హౌసింగ్ లోన్ అకౌంట్ నెం. 38440291938)** వారిని సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా సదరు నోటీసులు తెలిపిన మొత్తం 27-12-2023 నాటికి **రూ.12,80,366/- (పన్నెండు లక్షల ఎనభై వేల మూడు వందల అరవై ఆరు రూపాయలు మాత్రమే)** ప్లస్ వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు మొ॥ వాటి నుండి తరువాత చెల్లించిన మొత్తాలను తగ్గించి తిరిగి చెల్లించవలసినదిగా కోరారు.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో రుణగ్రహీత మరియు హామీదారు విఫలమైనందున సదరు రూల్స్‌లోని రూల్ 8(1)తో చదవబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలు వినియోగించుకుంటూ దిగువ వివరించినా ఆస్తిని దిగువ సంతకం దారు 26 ఫిబ్రవరి 2024న నిర్మాణాత్మక స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత / హామీదారుకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

సదరు ఆస్తితో ఎటువంటి వ్యవహారాలు జరుపరాదని మరియు సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారాలైనా 27-12-2023 నాటికి రూ.12,80,366/- **(పన్నెండు లక్షల ఎనభై వేల మూడు వందల అరవై ఆరు రూపాయలు మాత్రమే)** ప్లస్ దానిపై వడ్డీ, వ్యయాలు మరియు అనుషంగిక ఛార్జీలు మొ॥ వాటి నుండి తదుపరిగా చెల్లించిన మొత్తాలను తగ్గించి సదరు మొత్తం కోరారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛార్జ్‌కు లోబడి జరుగవలెనని ముఖ్యంగా రుణగ్రహీత/హామీదారును మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

చర మరియు స్థిర ఆస్తుల వివరణ

రిజిస్టర్డ్ గిఫ్ట్ డీడ్ నెం.167/2007 ఎస్ఆర్ఓ. మామిడికుదురు **శ్రీమతి కాండ్రేగుల దుర్గా లక్ష్మి భర్త దుర్గారావు** ద్వారా కవర్ చేయబడిన ఆస్తి.

తూర్పుగోదావరి జిల్లా, మామిడికుదురు మండలం, ఈదరాడ గ్రామం, మామిడికుదురు ఎస్ఆర్ఓ. వద్ద గల ఆర్‌సీసీ భవనంతో సహా ఆర్ఎస్‌నెం.174/6ఏలో జిడ్-ట్రైలో మొత్తం ఎ.0-10 సెంట్లలో నుండి దక్షిణం వైపు ఎ.0.02 1/2 సెంట్లు (121 చ.గజాలు) విస్తీర్ణం గల భూమి యావత్తు సరిహద్దులు - **తూర్పు :** అనుమూరి సాంబశివరావు స్థలం, **దక్షిణం :** రోడ్, **పడమర :** కాండ్రేగుల వెంకటేశ్వరరావు స్థలం, **ఉత్తరం :** కాండ్రేగుల దుర్గారావు భూమి

తేది : 26-02-2024
ప్రదేశం : మామిడికుదురు

సం/- అధీకృత అధికారి
స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా